**కథానిక**

# కొత్త జీవితం

పని పూర్తయి సోఫాలో కూర్చున్నాను. బయట ఎండ, లోపల చాలా ఉక్కగా వుంది. ఫాను వేస్తే తిరగలేదు. ఎదురుగావున్న గడియారం యిది పవర్‌కట్ టైమ్ అని గుర్తు చేసింది. పక్కింటి లలితాశర్మకి జనరేటర్ వుంది కనుక, ఎదురింటి రమకి యిన్వర్టర్ వుంది కనుక వాళ్ళకి ఉక్కబాధ తెలియదు. నేను మాత్రం ఎపిఎస్ఇబి వారి దయా ధర్మాల మీద ఆధారపడి బ్రతుకుతున్న మధ్యతరగతి ఇల్లాల్ని.

పెళ్ళయిన దగ్గర్నుంచి అన్నిటికీ సర్దుకు పోవడమే జీవితం అయిపోయింది. ఇంజనీర్, హైదరాబాద్‌లో ఉద్యోగం యింకేవిటి సరదాలు, షికార్లే జీవితం అనుకున్నాను. కానీ ఆయనకి చెల్లెలి పెళ్ళి, తమ్ముడి చదువు అనే 'కమిట్‌మెంట్స్' వున్నాయని తరువాత తెలిసింది. సరే, సర్దుకుపోవడం మొదలయింది. ఆ రెండు బాధ్యతలు తీరేసరికి యింకో రెండు బాధ్యతలు యిద్దరు పిల్లల రూపంలో వచ్చాయి. వాళ్ళ అవసరాలు, చదువులకు 'ప్రియారిటీ' ఇచ్చి అవి తీరుస్తూనే గవర్నమెంట్ లోనుతో ఒక చిన్న ఇల్లు కట్టుకున్నాం. చాలా పెద్ద స్థలం. మధ్యలో ఒక డూప్లెక్స్ బంగళా. పెద్దతోట, మధ్యలో లాన్– యివీ నా ఆశలు. కానీ నాకు దొరికింది 'మినియేచర్ బంగ్లా'. మా యింటికి నేను పెట్టింది పేరు 'పర్ణకుటీర్'. "సిమెంట్, ఇటుకలకి కూడా ఖర్చు పెట్టకుండా సెటింగ్‌లాగా వెదురు బొంగులతో యిల్లు కట్టుకుంటే డబ్బయినా మిగిలేది" అని నేనంటూ వుంటాను మా వాళ్ళతో.

"బొంగుల యింట్లో దొంగలు దూరడం యీజీ అమ్మ" అన్నది అమ్మాయి రీమా.

"చాల్లే. మన ఇంట్లో ఏమున్నాయని ఎత్తుకు పోవడానికి? ఛీ, యిలాంటి యింటికి కన్నమేసి టైము వేస్టు చేసుకుని, పరువు పోగొట్టుకున్నానని సిగ్గుతో వెళ్ళిపోతారు దొంగగారు" అన్నాను నేను.

"పోనీలే అమ్మా. మ్యూజియంలో పెట్టదగిన 'యాంటిక్ పీస్' లున్నాయి కదా మనింట్లో" అన్నాడు అబ్బాయి రాజా.

మా యింట్లో వున్న యాంటిక్ పీస్‌లలో మొదటిది ఫ్రిజ్. పెళ్ళయిన కొత్తల్లో యిన్స్టాల్‌మెంట్ పద్ధతిలో కొనుక్కున్నాము. ఇరవై మూడేళ్ళయినా మా వారిలాగే అది కూడా చాలా సిన్సియర్‌గా పనిచేస్తోంది. ఫ్రిజ్ చిన్నది, అదీకాక పాతదిగా కనబడుతోంది. మా చుట్టాల సర్కిల్‌లో ఇన్ని సంవత్సరాలు ఒకే ఫ్రిజ్ వుంచుకున్న వాళ్ళు ఎవ్వరూ లేరు. "ఇన్నేళ్ళు ఎవ్వరిదగ్గర ఒకే ఫ్రిజ్ వుండి వుండదు. మీకు మంచి పబ్లిసిటీ వస్తుంది. మా ఫ్రిజ్ తీసుకుని మాకు కొత్త ఫ్రిజ్ ఎక్స్ఛేంజిగా యివ్వండి" అని కంపెనీ వాళ్ళని అడిగితే "25 ఏళ్ళయితే సిల్వర్ జూబ్లీ ఆర్టికల్ అని ఎక్స్ఛేంజి చెయ్యొచ్చేమో ఆలోచించవచ్చు. ఇంక రెండేళ్ళు అది పనిచేస్తే అప్పుడు రండి" అని చెప్పారు.

ఇక రెండో యాంటిక్ పీస్ వాషింగ్ మెషిన్. అది తిరగడం మానేసి చాలారోజులయింది. రెండు సార్లు రిపేర్ చేయించడం, అది తిరిగి పాడవడం జరిగింది. వాషింగ్ మేషిన్ మంచి ఖరీదుది, ఆటోమాటిక్‌ది రిటైరయిన తర్వాత కొనిపెడతానని



–అనన్య

ప్రామిస్ చేశారు మావారు. పైగా అంటారు– అయినా మన వరసమ్మ బట్టలు ఉతికినట్లు ఏ వాషింగ్ మెషీను ఉతకదు. మా ఆఫీసులో రోజూ అడుగుతారు 'మీ బట్టలు యింత తెల్లగా వుంటాయి, ఏ సోపు పౌడర్ వాడతారు అని' అని 'వీర సర్ఫ్' అడ్వర్‌టయిజ్‌మెంట్ లాగ పోజిస్తారు. సరే, మా వాషింగ్ మెషీన్ ప్రస్తుతం 'మైలేదాన్' అవతారం ఎత్తింది. అది వేరే విషయం అనుకోండి.

మరి ముచ్చటగా మూడోది టి.వి. మాది కలర్ టి.వియే కాని రిమోట్, ఎస్ బాండ్‌లు రాని కాలం నాటిది. ఎస్ బాండ్ వున్న టి.వి కొనుక్కుందాం అంటే, 33 ఛానల్స్ వస్తాయిట చక్కగా యిష్టమైన ప్రోగ్రాం చూడొచ్చు అని అంటే వున్న ఛానల్స్ చూడడానికి టైము చాలదు, యింకా ఎక్కువ ఛానల్స్ ఎందుకూ? అయినా చదువుకునే పిల్లలు వున్న యింట్లో టి.వి ఎక్కువగా చూస్తే చదువులు పాడైపోతాయి అంటారు. పోనీ ఒక ఎయిర్‌కూలర్, ఒక యిన్వర్టర్ కొనండి, హైదరాబాద్‌లో ప్రతీ ఏడాదికి ఎండలు మండి పోతున్నాయి. అంటే ఆదా చెయ్యవలసిన విద్యుచ్ఛక్తిని యిన్వర్టర్లు, జనరేటర్ల ద్వారా యింకా ఎక్కువ ఖర్చు పెట్టినట్లవుతుంది. బాధ్యతగల పౌరులుగా పరిస్థితిని అర్థం చేసుకుని సహజ వాతావరణంలో బ్రతకడం నేర్చుకోవాలి అంటూ లెక్చర్ రెడీ! ఈయనని దేశానికి ఆర్థిక మంత్రిగా చేసుంటే దేశంలో సంపద నిల్వలకి లోటుండేది కాదు. ఇదండీ మాయింట్లో సంగతి.

రేపటి రోజు దేనికోసం ఎదురుచూడాలి? నా జీవితంలో కోరుకున్నవన్నీ అమిరే రోజంటూ వస్తుందా అసలు? పూర్తి జీతంలోనే ఏమీ కొనుక్కోలేని మేము రిటైరయిన తర్వాత పెన్షన్‌లో ఏం కొంటాం? ముందు అమ్మాయి పెళ్ళుంది. మేము పెద్దవాళ్ళవుతున్నాం, రోగాలు వస్తే డబ్బు కావాలి, యింక నా కోరికలు తీరేదెప్పుడు? ఉక్కతో మరి విసుగనిపించి తలుపు తెరుచుకుని బయటికి వచ్చాను చెట్ల మధ్య కాస్త గాలి వస్తుందేమోనని. నా చిన్న తోటలోని పచ్చని చెట్ల రంగురంగు లపూలు నన్ను నవ్వుతూ పలకరించబోయినా, నామూడ్ బాగాలేక నేను పూర్కేవున్నాను. రమ, లలిత గోడ దగ్గర నుంచుని కబుర్లు చెప్పుకుంటున్నారు. మారుతి వున్నా సియాలో కొనుక్కుంది లలిత. సింగిల్ డోర్ ఫ్రిజ్ యిచ్చేసి డబుల్ డోర్ ఫ్రిజ్ కొనుక్కొంది రమ. వాళ్ళు మాయింటి వేపే చూస్తున్నారు. ఇంకేవుంది. యింకా ఏదో కొత్తగా కొనుక్కున్నామని చెప్పడానికి వస్తారేమో! నాకసలు వాళ్ళతో కలవాలని లేదు. గిరుక్కున తిరిగాను, లోపలికి వెళ్ళిపోదామని. బోగన్‌విలియా తీగ ముల్లు మెడకి గుచ్చుకుని బాగా నెత్తురు రావడం మొదలుపెట్టింది. లోపలికి వెళ్ళి కడుక్కుని డెట్టాల్ రాసాను. గాయం లోతుగానే వుంది. సాయంకాలం రాజా డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళాడు. ఆయన కుట్లు వేసి, టి.టి.యింజక్షను యిచ్చి మెడ దగ్గర పరీక్షగా చూసి "యీ వాపు ఏవిటమ్మా, యిప్పుడే వాచిందా?" అన్నారు. నేను చూసుకుని "ఏమోనండి, గమనించలేదు" అన్నాను.

వారంరోజుల తర్వాత గాయం తగ్గిపోయింది కాని మెడమీద వాపు కంతిలాగ పెద్దదయింది.

మళ్ళీ డాక్టరు దగ్గరికి వెడితే చాలా పరీక్షలు చేయించి, అది ట్యూమరని, తొందరలో ఆపరేషన్ చేయించుకోవడం మంచిదని చెప్పారు. నాకు తల తిరిగిపోయింది. ఆకాశం విరిగి మీద పడ్డట్లయింది. భవిష్యత్తు వెలుగనేది లేకుండా మొత్తం

నీకటైపోయినట్లయింది. ఒక పక్క నేను జీవితం మీద ఎన్నో ఆశలు పెట్టుకుమంటే, యింకో పక్క అసలు జీవితం వుందో లేదో అన్న అనుమానం వచ్చేస్తోంది. నాకు ట్యూమరు అంటే కాన్సరు అంటే నా జీవితం రోజులలోకి వచ్చేసినట్లే అన్న బాధ నన్ను లోలోపల తినేస్తోంది. బయట అందర్నీ చూస్తుంటే వీళ్ళంతా సుఖంగా వున్నారు, వీళ్ళకి చావు యింత త్వరలో రాదు, నాకే ఎందుకు యిలా అవాలి చాల బాధగా వుంది. ఐనా నేను పైకి ఏడవడం లేదు. అలాగని నవ్వుతూ కూడా లేను. మా యింటి మెంబర్సు ముగ్గురూ సీరియస్ అయిపోయారు. ఎంత మామూలుగా వుందామని ప్రయత్నిస్తున్నా, అది తెచ్చిపెట్టుకున్నదన్న విషయం తెలిసిపోతోంది.

ఒక వారం రోజులు ముందుగానే ఆస్పత్రిలో జాయినయ్యాను. లేవలేని స్థితిలో లేను కనుక అటూ ఇటూ తిరుగుతూ మిగిలిన రోగులను పలకరించాను. కొందరు స్పృహలో లేరు. మరికొందరికి ఓదార్పునిచ్చే దగ్గరవారెవరూ లేరు. మాటలేక కొందరు, చూపులేక కొందరు బాధపడుతుంటే నా బాధ, భయం కొంచెం తగ్గినట్లనిపించింది. వారిని ఓదార్చాలనిపించింది. ఒంటరిగా ఈ ప్రపంచంలోకి వచ్చి, ఒంటరిగా వెళ్ళిపోయినా, బ్రతికున్నన్ని రోజులూ మనిషి ఒంటరితనాన్ని కోరుకోడు అనుకున్నాను.

ఆ రోజు ఒక కొత్త డాక్టరు వచ్చి నా కేస్ షీటంతా చదివి, నావైపు తిరిగింది. "అరె, వేదవతి, నన్ను గుర్తుపట్టావా?" అంది. పెద్దకళ్ళు, ఉంగరాలు తిరిగిన పొట్టి జడ. "ప్రతిభా" అన్నాను. నేను, ప్రతిభ పియుసిలో క్లాస్‌మేట్స్‌మి. తను చాలా తెలివైనది, ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ వుండేది. ఒకసారి తెలుగు పీరియడ్‌లో 'ప్రతిభా'కి నిర్వచనం అడిగింది మాస్టారిని. 'నవనవోన్మేషశాలినీ ప్రతిభ నువ్వేనమ్మా' అన్నారు ఆయన. తర్వాత తను మెడికల్ కోర్సులో, నేను డిగ్రీలో జాయినవడంతో దూరమయ్యాము. నా పెళ్ళయి, సంసార సాగరంలో మునిగిపోవడంతో పాత స్నేహితులు జ్ఞాపకాల అట్టడుగుకి వెళ్ళిపోయారు. ప్రతిభలో ఎక్కువ మార్పు లేదు. ముఖంలో కొంచెం గంభీరత చోటు చేసుకున్నట్టుంది. నా కుటుంబం గురించి అడిగింది. నాకు, మావాళ్ళకి ధైర్యం చెప్పింది. తెలిసిన డాక్టరు వచ్చిందని మావాళ్లు సంతోషపడ్డారు. రోజూ వచ్చి పాత కబుర్లు గుర్తుచేసేది.

ఆపరేషన్ ముందురోజు మనసంతా చాలా అలజడిగా వుంది. మళ్ళీ బ్రతికివచ్చి పూర్వపు నా జీవితం గడుపుతానా అని భయంగా వుంది. మందుల ప్రభావంతో పట్టిన మగత నిద్రలో నేను భగవంతుడిని నాకు జీవితం ప్రసాదించమని అడుగుతున్నాను. "నిన్ను బ్రతికించినందువలన ఎవరికి ఉపయోగం?" అని ప్రశ్నించారు ఆయన. "అదేమిటి స్వామీ. పాతికేళ్లుగా నా భర్త, పిల్లలు వీరికి



## జీవితాన్ని అర్థవంతంగా ఎందుకు గడపాలి!

సేవచేస్తూ జీవితం గడపలేదా?" అని అడిగాను. "అది కూడా ఒక సేవా? బయట ఎవరికయినా ఉపయోగపడ్డావా, అసలు జీవితానికి అర్థమే నువ్వు తెలుసుకోలేదు" అన్నారు. "ఆ అర్థమేమిటో నాకు తెలియజేయండి స్వామీ, ఆ ప్రకారమే మిగిలిన జీవితం గడుపుతాను" అంటూ ఆయన కాళ్ళు పట్టుకుని ఏడవడం మొదలుపెట్టాను.

"వేదా, ఎందుకేడుస్తున్నావు? నిద్రపట్టలేదా, భయం వేస్తోందా?" అంటూ మావారు నన్ను తట్టి లేపించి దగ్గరికి తీసుకున్నారు.

"చూడు వేదా, భగవంతుడి మీద నాకు నమ్మకం వుంది. చిక్కులు ఇచ్చిన దేవుడే దానికి పరిష్కారం చూపిస్తాడు. ధైర్యంగా వుండు" అని అనునయించారు.

థియేటర్‌లోకి ప్రతిభ వచ్చింది "ధైర్యవంతులని అదృష్టదేవత వరిస్తుందిట" అంటూ ధైర్యం చెప్పింది. కళ్ళు మూసుకుని లోపలికి వెళ్ళాను.

తెలివి వచ్చిన తర్వాత నొప్పి తెలిసింది. బ్రతికి బయటపడ్డాను, అంతే చాలు అనిపించింది.

వారం రోజుల తరువాత ఇంట్లో అడుగు పెడుతుంటే ఎంతో ప్రశాంతతగా అనిపించింది. నవ్వుతూ పలకరించిన చెట్లని ముద్దు పెట్టుకున్నాను.

తర్వాత ఒకరోజు ప్రతిభ మా ఇంటికి వచ్చినపుడు నాకు వచ్చిన కల, దేవుడు నన్ను తిట్టిన విషయం చెప్పాను. ఒక నిమిషం వూరికే వుండి "వేదా, నీకు ఇష్టమైతే ఒకచోటికి తీసుకువెడతాను. వస్తావా?" అంది.

"డాక్టరుగారితో ఎక్కడికైనా వెళ్ళడానికి ఈ పేషెంట్ రెడీ" నవ్వుతూ అన్నాను.

ఒక పెద్ద కాంపౌండ్ వున్న ఇంటిముందు ఆగాము. లోపల, నాలుగుపక్కలా చెట్లు, మొక్కలు వున్నాయి. పిల్లలు ఆడుకోవడానికి జారబండ, ఉయ్యాలలు వున్నాయి. పెద్ద హాలులో ఒకచోట సంగీతం క్లాసు నడుస్తోంది. ఇంకొకచోట చదువు, మరొక హాలులో పిల్లలు చెక్కదిమ్మలతో ఇళ్ళులాంటివి అమరుస్తున్నారు. ఇంకొకచోట పెద్ద పిల్లలు కాగితాలు బొత్తిగా పెట్టి, అట్టతో పుస్తకాలు తయారుచేస్తున్నారు. ఇంకొకచోట చేతిపనుల క్లాసు. కానీ ఒక విషయం గమనించాను. ఆ పిల్లలెవరికీ చేసే పనిమీద ఏకాగ్రత లేదు. కొంచెంసేపు చేసి పక్కన పడేసి, పడుకుని లేచి అటు చూసి, ఇటు చూసి చేస్తున్నారు. ముఖాలలో తెలివి లేకపోవడం తెలిసిపోతోంది. అక్కడినుంచి బయటకు వచ్చాము.

"ఎవరు ప్రతిభా, ఈ పిల్లలు! నీకు, ఈ ఆశ్రమానికి ఏం సంబంధం? అసలు నీ భర్త, పిల్లలని నాకు చూపించనే లేదు నువ్వు!" అన్నాను.

కొంచెంసేపు నిశ్శబ్దం. తర్వాత మెల్లిగా అంది "నా భర్త మనకెవరికీ అందనిచోటుకి వెళ్ళిపోయారు. కాని ఆయన నాకు జీవితపు విలువలు తెలియజెప్పారు. ఉన్నదాంతో తృప్తిచెందడం, స్వార్థం వదిలి తోటివారికి వీలయినంత ఉపయోగపడడం, ఇవన్నీ ఆయన నేర్పారు. ఆయన పోయినా, ఆయన ఇచ్చిన స్ఫూర్తితో ఈ ఆశ్రమం మొదలుపెట్టాను. పూర్వజన్మలో ఏ పాపం చేశారో ఇలాంటి పుట్టుక దొరికింది. వారిని వీలయినంత మామూలు మనుషులుగా తయారుచేయడం, వారి ఉనికి కూడా సంఘానికి అవసరమే అని తెలియజెప్పడమే నా ఉద్దేశం" అంది.

నాకు కనువిప్పయినట్టయింది. చాలామంది కంటే మంచి జీవితమే ఇచ్చాడు దేవుడు నాకు. అయినా నేను ఇంకా ఏదో లేదని, కావాలని తాపత్రయపడుతూ అసంతృప్తిగా బ్రతికాను. భర్త, పిల్లలు, తన వారెవరూ లేకపోయినా ప్రతిభ ఏడుస్తూ కూర్చోక జీవితం అర్థవంతంగా గడుపుతోంది. ఒంటరికాదు తను.

మర్నాటినుంచీ నా దినచర్య మార్చుకున్నాను. తొందరగా ఇంటి పనులు ముగించుకుని, ఆశ్రమం వెళ్ళి అక్కడ పిల్లలకి పాటలు, కథలు చెప్పడం, వారితో గడపడం, సాయంకాలం నేను ఆపరేషన్ చేయించుకున్న ఆస్పత్రిలో రోగులకు జడలు వేసి, బట్టలు మార్చి, మందులు తాగించి, ధైర్యం చెప్పి జీవితం మీద ఆశ కలిగించడం చేస్తున్నాను. ఇప్పుడు నాకు చాలా తృప్తిగా వుంది. ఒకరోజు ప్రతిభ నా ట్యూమరు ప్రమాదకరమైనది కాదని రిపోర్ట్ వచ్చిందని సంతోషంగా చెప్పింది. నాకది ప్రత్యేక వార్తగా అనిపించలేదు. నాకిప్పుడు చావంటే భయం లేదు. కొన ఊపిరి వరకు ఇంకొకరికి చేయూతనిస్తూ బ్రతికితే చాలనే భావనతో వున్నాను. జీవితపు విలువలు తెలుసుకుని కొత్త జీవితం గడుపుతున్నాను. ఇదంతా నా చెలియ నవనవోన్మేషశాలిని ప్రతిభ వలనే!